# దూరు రాములు కుటుంబానికి బీఆర్ఎస్ భరోసా

## కష్టకాలంలో అండగా నిలిచిన నాయకులు

- నర్సింహులపేటలో మానవత్వం చాటిన బీఆర్ఎస్ శ్రేణులు
- రూ.6000 విలువైన క్వింటల్ బియ్యం అందజేత
- కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ



తొలి అక్షరం/నర్సింహులపేట, ఏప్రిల్ 03 : నర్సింహులపేట గ్రామానికి చెందిన దూరు రాములు స్వర్గస్తులైన విషయం తెలిసి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబానికి ఆదుకోవాల్సిన అవసరం ఉన్న ఈ క్లిష్ట సమయంలో, నర్సింహులపేట గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు మానవత్వాన్ని చాటుతూ ముందుకు వచ్చారు. దూర రాములు కుటుంబానికి తమ వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో పార్టీ తరఫున రూ.6000 విలువైన ఒక క్వింటల్ బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు, వారి దుఃఖంలో పాలుపంచుకుని ఓదార్పు తెలిపారు. "కష్టకాలంలో ప్రజలతో పాటు ఉండటం మా బాధ్యత. దూర రాములు కుటుంబానికి ఎలాంటి అవసరం వచ్చినా బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది" అని వారు పేర్కొన్నారు. గ్రామంలో సామాజిక బాధ్యతను గుర్తిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తా యని స్థానిక ప్రజలు అభిప్రాయపడ్డారు. ఒకరి కష్టం మరొకరు పంచుకోవడం గ్రామీణ సంస్కృతిలోని గొప్పతనాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. వారు దూర రాములు కుటుంబానికి ధైర్యం చెబుతూ, ఈ కష్టాన్ని ఎదుర్కొనేందుకు మానసికంగా బలంగా ఉండాలని సూచించారు.

# శ్రీరామ రక్ష.. హనుమ 'సింధూర' దీక్ష!

### స్వామి అమాయకత్వపు భక్తికి ముగ్ధుడైన దాశరథి

### నిజాంపేట్ అర్చకులు రాము పంతులు వివరించిన ఆంజనేయుడి అచంచల రామప్రేమ

తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఏప్రిల్ 3: నిజాంపేట్ శ్రీ అభయ ఆంజనేయ స్వామి అంటేనే అచంచల భక్తికి, తిరుగులేని శక్తికి నిలువెత్తు రూపం. ఆ స్వామి విగ్రహాన్ని దర్శించగానే మనకు కనిపించే గాఢమైన సిందూర వర్ణం వెనుక ఒక అద్భుతమైన పౌరాణిక రహస్యం దాగి ఉంది. సర్వ శాస్త్ర పారంగతుడైన ఆ వాయుపుత్రుడు, ఒక పసిబాలుడి అంతటి నిష్కల్మషమైన అమాయకత్వంతో తన శరీరం అంతటా ఎందుకు సిందూరాన్ని అద్దుకున్నాడు? ఆ గాథలోని అంతరార్థాన్ని నిజాంపేట్‌లోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి ప్రధాన అర్చకులు రాము పంతులు భక్తులకు అత్యంత మనోహరంగా వివరించారు. **సీతమ్మ మాట.. హనుమకు వేదవాక్కు** రావణ సంహారం అనంతరం అయోధ్యలో రామరాజ్యం వర్ధిల్లుతున్న కాలమది. ఒకనాడు మాత సీతాదేవి తన నుదుట ఎర్రని సిందూరాన్ని ధరించడం చూసిన



హనుమంతుడు, కుతూహలంతో దాని విశిష్టతను అడిగాడు. "తల్లీ! ఆ ఎర్రని చూర్ణాన్ని నుదుట ఎందుకు ధరిస్తున్నావు?" అని ప్రశ్నించగా.. "నాయనా హనుమా.. ఇది నా ప్రాణనాథుడైన శ్రీరామచంద్రుడి ఆయురారోగ్యాలను వృద్ధి చేస్తుంది, ఆయనకు సర్వదా రక్షణగా ఉంటుంది" అని ఆ జగన్మాత మందహాసంతో బదులిచ్చారు. **కాయమంతా సిందూరమయం.. భక్తి పారవశ్యం** తల్లి నుదుట పెట్టుకున్న ఒక చిన్న రేఖే రాముడికి అంతటి రక్షణనిస్తే.. తన వజ్రదేహమంతటా ఆ సిందూరాన్ని అద్దుకుంటే తన రామయ్య ఇంకెంత కాలం వర్ధిల్లుతాడు? ఆయనకు మరెంతటి మేలు జరుగుతుంది? అని ఆ మారుతి భావించారు. మరుక్షణమే ఏమాత్రం సంకోచించకుండా, భక్తి పారవశ్యంతో తన దేహమంతటా సిందూరాన్ని పూసుకున్నారు. ఒళ్లంతా ఎర్రని రంగుతో, రామనామ స్మరణ చేస్తూ సభలోకి ప్రవేశించిన ఆంజనేయుడిని చూసి అందరూ విస్తుపోయారు. **రాఘవేంద్రుడి అభయం.. సకల కష్టాల నుంచి విముక్తి** హనుమంతుడి నిష్కల్మషమైన, అపారమైన ఆ భక్తిని చూసి శ్రీరామచంద్రుడు చలించిపోయారు. ఆ స్వామిని అక్కున చేర్చుకుని ఇలా వరం ఇచ్చారు.. "హనుమా! నీ భక్తికి సాటిలేదు. ఇకపై ఎవరైతే నిన్ను సిందూరంతో అర్చిస్తారో, వారికి జీవితంలో ఎదురయ్యే సకల అరిష్టాలు, గ్రహ దోషాలు తొలగిపోతాయి. నీకు సిందూర లేపనం చేసే భక్తులకు నా అనుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుంది" అని అభయమిచ్చారు. **అరిష్టాల నివారణకు సిందూర పూజ** ఈ విశేషాలను వివరిస్తూ రాము పంతులు గారు.. "హనుమంతుడికి సిందూరం సమర్పించడం అంటే కేవలం రంగు పూయడం కాదు.. మనలోని అహంకారాన్ని విడిచి, ఆ స్వామికి సర్వస్వం అంకితం చేయడం. జ్యోతిష్య రీత్యా కుజ దోషాలు, శని ప్రభావంతో బాధపడేవారు స్వామివారిని సిందూరంతో పూజిస్తే తక్షణ శాంతి కలుగుతుంది" అని పేర్కొన్నారు. నిజాంపేట్‌లోని అభయ ఆంజనేయ స్వామి సన్నిధిలో ఈ పౌరాణిక విశేషాలను విన్న భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

# నైనాల గ్రామంలో విషాద ఛాయలు...

- బొడ్డు నారయ్యకు మాల మహానాడు నేతల ఘన నివాళులు
- సేవామూర్తి జ్ఞాపకాలతో మోగిన గ్రామం సమాజానికి తీరని లోటు...
- కుటుంబానికి అండగా ఉంటామని హామీ



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఏప్రిల్ 3: నెల్లికుదురు మండలం నైనాల గ్రామానికి చెందిన మాల మహానాడు నాయకులు, సీనియర్ పెంటర్ బొడ్డు నారయ్య ఇటీవల మృతి చెందగా, ఈరోజు వారి చిత్రపటం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై చివరి నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు మండల అధ్యక్షులు కారం ప్రశాంత్ మాట్లాడుతూ, "బొడ్డు నారయ్య సమాజ సేవలో ఎప్పుడూ ముందుండే వ్యక్తి. ఆయన చేసిన సేవలు గ్రామానికి చిరస్మరణీయంగా నిలుస్తాయి. ఇలాంటి నాయకుడిని కోల్పోవడం సమాజానికి తీరని లోటు" అని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, ఎప్పుడూ తమ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జిల్లా ప్రచార కార్యదర్శి చెదల యకాంతం, కుల పెద్దలు మయ్య వీరయ్య, బొడ్డు యాకయ్య, ఏన్నమల్ల శ్రీధర్ పాల్గొని నారయ్య సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. అలాగే గ్రామ అధ్యక్షులు బొడ్డు విజయ్, బొడ్డు సురేష్ పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

# ఎడ్ల బండిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జోరు

**బండ్ల జాతర అదిరింది గురూ..**

**మొగిలిగిద్ద గ్రామంలో బండ్ల జాతర షురూ..**

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కార్యక్రమం..**

**పెద్దఎత్తున హాజరైన భక్తులు..**

తొలి అక్షరం/షాద్ నగర్, ఏప్రిల్ 03: ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పేరుగాంచిన అతి పురాతన గ్రామం ఫరూక్ నగర్ మండలం మొగలిగిద్ద. ఇక్కడి శ్రీ భవాని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో బండ్ల జాతరను శుక్రవారం పెద్ద ఎత్తున ప్రారంభించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన హాజరై బండ్ల జాతరను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు హృదయానికి ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయని, ఇలాంటి కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. మొగిలిగిద్ద గ్రామంలో జరిగిన ఈ జాతర ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని, దశాబ్దాల కాలంగా ఈ జాతర నిర్వహించడం, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలి



రావడం జరుగుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ యువ నాయకుడు గుట్ట రాజు ఇక్కడ జాతర



కార్యక్రమాలను పర్యవేక్షించడం జరుగుతుంది. మున్సిపల్ చైర్మన్ బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన, కృష్ణారెడ్డి, పి ఎస్ సి ఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, కోట్ల శ్రీశైలం, డీలర్ మల్లేష్, సురేందర్ బాబు, నారం రెడ్డి, పటాన్ పాషా, బాలరాజు గౌడ్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# రామన్నగూడెం దేశానికి ఆదర్శం

**"మన గ్రామం - మన బాధ్యత"తో భద్రతకు నూతన దిశ**

**హెల్మెట్ ధారణపై గ్రామస్తుల ఏకగ్రీవ నిర్ణయం 100% భద్రత లక్ష్యం**

**గ్రామంలో ప్రతి ఇంటికి భద్రత సందేశం.. హెల్మెట్లు పంపిణీ చేసిన ఎస్పీ డాక్టర్ శబరీష్**



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఏప్రిల్ 3: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు పోలీస్ స్టేషన్ పరిధిలోని రామన్నగూడెం గ్రామం "మన గ్రామం – మన బాధ్యత" కార్యక్రమంతో ప్రత్యేక గుర్తింపు సాధించింది. గ్రామ ప్రజలతో నేరుగా మమేకమైన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, డిఎస్పీ తిరుపతిరావు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు పాల్గొని భద్రత, అభివృద్ధి అంశాలపై సమగ్ర చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, ద్విచక్ర వాహనదారుల ప్రాణ రక్షణలో హెల్మెట్ కీలకమని అధికారులు స్పష్టం చేశారు. ఈ పిలుపుకు స్పందించిన గ్రామస్తులు ఏకగ్రీవంగా వందశాతం హెల్మెట్ ధారణ గ్రామంగా తీర్మానం చేసి, తమ బాధ్యతను చాటుకున్నారు. ఇది కేవలం ఒక నిర్ణయం కాకుండా, గ్రామ భవిష్యత్తు భద్రతకు బలమైన సంకల్పంగా నిలిచింది. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ శబరీష్ గ్రామస్తులకు హెల్మెట్లు పంపిణీ చేస్తూ, "ఒక హెల్మెట్ ఒక ప్రాణాన్ని కాపాడుతుంది" అనే సందేశాన్ని స్పష్టంగా తెలియజేశారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. రామన్నగూడెం తీసుకున్న ఈ నిర్ణయం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి, ప్రజల్లో భద్రతపై కొత్త అవగాహనకు నాంది పలికింది.

# నిజాంపేట్‌లోని శ్రీ బ్రహ్మారాంబ మల్లిఖార్జున స్వామి ఆలయంలో హిందూ ధర్మ మహో సమ్మేళనం




### బండారి లేఅవుట్‌లో ధర్మ చైతన్యానికి వేదిక

### ఏప్రిల్ 12న మహాసమ్మేళనం

### భజనలు, ప్రవచనాలు ప్రత్యేకం

### ముగ్గుల పోటీలు, సత్కారాలు, ప్రసాద వితరణ ఏర్పాట్లు

తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఏప్రిల్ 3: నిజాంపేట్ పరిధిలోని బండారి లేఅవుట్‌లో ఉన్న శ్రీ




బ్రహ్మారాంబ మల్లిఖార్జున స్వామి ఆలయంలో హిందూ ధర్మ మహో సమ్మేళనం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏప్రిల్ 12, 2026 ఆదివారం ఉదయం 9:30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. సనాతన హిందూ ధర్మ వైభవాన్ని ప్రజల్లో విస్తరింపజేయడం, సమాజంలో ధర్మ చైతన్యం పెంపొందించడం లక్ష్యంగా ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనాదిగా కొనసాగుతున్న హిందూ ధర్మం కేవలం మతం మాత్రమే కాకుండా, మానవతా విలువల సమాహారంగా నిలిచిందని, దేవతలను ఆరాధించడం, ప్రకృతిని పరమాత్మగా భావించడం, దేశభక్తితో జీవించడం హిందూ సంస్కృతికి ప్రత్యేకత అని వారు వివరించారు. పూర్వీకులు అందించిన ఈ గొప్ప వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ మహాసమ్మేళనంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ధర్మం యొక్క విశిష్టతను తెలియజేసే జ్ఞానోదయ ప్రసంగాలు, భక్తి సంకీర్తనలు కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సమాజ సేవలో, ధర్మప్రచారంలో విశిష్ట సేవలు అందించిన వారిని సత్కరించనున్నారు. అలాగే సామూహిక ప్రార్థనలు కూడా నిర్వహించనున్నారు. ఇదే సందర్భంగా ముగ్గుల (రంగోలి) పోటీలు ఏప్రిల్ 5, 2026 ఆదివారం సాయంత్రం 4:00 గంటలకు బండారి లేఅవుట్ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. పోటీలో పాల్గొనదలచిన వారు ఏప్రిల్ 3లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 80961 80960, 97044 06111 నంబర్లను సంప్రదించవచ్చు. మహాసమ్మేళనం ముగిసిన అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు పాల్గొనే ప్రతి ఒక్కరికీ భోజన ప్రసాదం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

